www.ijmer.in
INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:9, ISSUE:12(8), December:2020

# మన విద్యావిధానం - ఒక ఆలోచన

డా. నందవరం మృదుల,

అసోసియేట్ ప్రొఫెసర్ - తెలుగుశాఖ,

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల - బేగంపేట, హైదరాబాద్.

nmrudula1969@gmail.com +919441408393.

**ఉపోద్ఘాతం:** ఏ దేశ భవిష్యత్తు అయినా విద్య, వైద్య రంగాలపై ఆధారపడి ఉంటుంది. విద్యతో మానసిక ఆరోగ్యం, వైద్యంతో శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుంది. ప్రజల భవిష్యత్తును నిర్ణయించే ఈ రెండు రంగాలు ఎప్పటికప్పుడు నిత్య నూతనంగా ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉంటేనే ప్రపంచపటంలో ఆదేశం 'సుచరిత' గా నిలబడుతుంది. మనది ప్రధానంగా వ్యావసాయిక దేశం కాబట్టి, 'మన విద్య' 'మన వైద్యం' మన మూలాలకు తగినట్లుగా ఉండాలి. అప్పుడే మన అస్థిత్వాన్ని కాపాడుకుంటాము. నేల విడిచి సాము చేయనంతవరకు మన అభివృద్ధి మన చేతుల్లోనే ఉంటుంది. లేనిపక్షంలో పరుల చేతికి వెళ్ళిపోతుంది.

ఒక జాతి ఔన్నత్యాన్ని తెలియజేసే పలు అంశాలలో విద్య ప్రథమ స్థానం వహిస్తుంది. అది పరంపరాగతంగా వచ్చిన <u>లిఖిత విద్య గాని అలిఖిత విద్య గాని</u> మానవమేధను పట్టి చూపిస్తుంది. కుటుంబం తర్వాత ఒక మనిషిని వెన్నంటి నడిపించేది విద్య ఒక్కటే. ఈ విద్య ఎంత బలంగా ఉంటే అంతగా మానవ జీవితం పరిపుష్టం అవుతుంది. దేశ ఔన్నత్యానికి ప్రధానప్రమాణమైన విద్యకు నేడు కొత్త దారులు తెరుచుకుంటున్నాయి. విద్యకు నూతన ద్వారాలు తెరిచిన మన మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు గారి స్ఫూర్తితో మనం అడుగులు ముందుకు వేస్తే మంచి మార్గం ఒకటి దొరకక పోదు.

**1.** పాఠశాల విద్య**:-** ఉన్నత విద్య బలోపేతం అవ్వాలంటే ముందుగా పునాదులు బలంగా ఉండాలి బలమైన పునాదులు లేకుండా పై నిర్మాణం ఎంత ఆకర్షణీయంగా రూపొందించినా ప్రయోజనం ఉండదు.

భారతదేశం వ్యావసాయక ప్రధాన దేశం కాబట్టి ఈ నేపథ్యంతోనే మన విద్యా విధానం రూపొందించబడాలి. మన మూలాలు ధ్వంసం చేసుకునే విధంగా 'విద్య'రూపకల్పన జరగకూడదు.

చదువని వాడజ్ఞుండగు
జదివిన సదసద్వివేక చతురత గలుగుం
జదువగ వలయును జనులకు
జదివించెద నార్యులొద్ద జదువుము తండ్రీ

(భాగవతం సప్తమ స్కంధం 130)

అని హిరణ్యకశిపుడే చదువు యొక్క గొప్పతనాన్ని తెలిపాడు. ఆ చదువు యొక్క పరమ ప్రామాణికత - సదసద్వివేక చతురత అని చెప్పాడు. ఆర్యుల వద్దకు వెళ్లి చదవమన్నాడు.

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:9, ISSUE:12(8), December:2020

**2.** ప్రభుత్వ పాత్ర**:-** విద్య వైద్యం - ఈ రెండు ఎప్పుడు ప్రభుత్వం చేతిలో ఉండవలసినవే. ఒకవేళ మరొకరి చేతికి పంపించాలనుకుంటే సేవాభావం ఉన్న వ్యక్తుల చేతికే వెళ్లాలి తప్ప వ్యాపార భావజాలం ఉన్న వారి చేతికి అందించకూడదు. అందుకు రెండు మార్గాలు ఎంచుకోవాలి.

2.1 సాధారణ పాఠశాలలు

2.2 గురుకుల పాఠశాలలు

**2.1** సాధారణ పాఠశాలలు**:-** ఐదవ తరగతి వరకు విద్యార్థులు ప్రతిరోజూ ఇంటి నుండి పాఠశాలకు వెళ్లి చదవాలి. అప్పుడు కుటుంబ బంధాలు బంధుత్వాలు బోధపడతాయి.

**2.2** గురుకుల పాఠశాలలు:- ఆరవ తరగతి నుండి గురుకుల విద్యను అందించాలి. అప్పుడు లోకజ్ఞానం, విషయజ్ఞానం పూర్తిగా విద్యార్థులు అందుకుంటారు.

**3.** బోధన స్థాయి:- విద్యార్థులను వయసుల వారీగా, వారి మనోపక్వత దృష్టిలో పెట్టుకొని కొన్ని సమూహాలుగా మనం గుర్తించవచ్చు.

3.1. అంగన్వాడి: 5 ఏళ్ళ లోపు బాలలు

3.2. ఒకటవ తరగతి నుండి మూడవ తరగతి వరకు

3.3. నాలుగవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు

3.4. ఆరవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు

3.5. ఎనిమిదవ తరగతి నుండి పదవ తరగతి వరకు

3.6. పదకొండవ తరగతి నుండి పన్నెండవ తరగతి వరకు

3.7. విశ్వవిద్యాలయ విద్య

**3.1.** అంగన్వాడి**:-** పిల్లలకు ఐదేళ్లు వచ్చేవరకు అంగన్వాడీ కేంద్రాలను ప్రభుత్వమే నడుపుతుంది. దిగువ మధ్యతరగతి కుటుంబాలు వీటిని ఉపయోగించుకుంటున్నాయి. వీటిని మరింత పటిష్టం చేసి ఆహారాన్ని సమకూర్చే కేంద్రాలుగానే కాక స్థానిక భాషలో అంటే తెలుగులో పాటలు పద్యాలు ప్రధానమైన ఇంగ్లీష్ హిందీ పదాలు సంఖ్య వాచకాలు నేర్పించవచ్చు.

**3.2.** ఒకటవ తరగతి నుండి మూడవ తరగతి వరకు**:-** తెలుగు ఇంగ్లీష్ హిందీ భాషలలో చిన్న చిన్న పాఠాలను ఒకే పుస్తకంలో (వివిధ విషయాలు సామాన్య సాంఘిక గణిత శాస్త్రాలు) పరిచయాత్మకంగా రూపొందించాలి.

తెలుగు - సామాన్య శాస్త్రము

ఇంగ్లీషు - సాంఘిక శాస్త్రము

హిందీ - గణిత శాస్త్రము

**3.3.** నాలుగవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు**:-** తెలుగు ఇంగ్లీష్ హిందీ భాషలలో, ఆయా భాషల సాహిత్యాలు, వ్యాకరణాలు, సామాన్య, సాంఘిక, గణిత శాస్త్రాల బోధన జరగాలి.

**3.4.** ఆరవ తరగతి నుండి ఏడవ తరగతి వరకు**:-** తెలుగు, ఇంగ్లీష్ హిందీ భాషలలో సాహిత్య, వ్యాకరణ, ఇతర శాస్త్రాలతో పాటు, ఇతర స్థానిక - ఉర్దూ భాషను పరిచయం చేయాలి.

**3.5.** ఎనిమిదవ తరగతి నుండి పదవ తరగతి వరకు**:-** పై తరగతులలో బోధించిన విధంగానే పాఠ్యాంశాలను బోధిస్తూ దక్షిణాది భాషను (కన్నడం / తమిళం / మలయాళం) పరిచయం చేయాలి. విషయాన్ని పాఠశాల స్థాయిలో కుప్పలు తెప్పలుగా పోయకుండా కొద్దికొద్దిగా అందిస్తూ భాషా సామర్థ్యాలను, అవి అందించే సంస్కారాలను విద్యార్థులకు చేరవేయాలి.

**3.6.** పదకొండవ తరగతి నుండి పన్నెండవ తరగతి వరకు**:-** మన ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో కలిపే ప్రయత్నం చేస్తుంది కాబట్టి 11-12 తరగతులను అత్యున్నత పాఠశాలగా మనం గుర్తించవచ్చు. ఈ తరగతులలోని పాఠ్యపుస్తకాలను పాఠశాల స్థాయి పాఠ్య పుస్తకాలు గానే రూపొందించినట్లయితే విద్యార్థులకు ఆయా భాషల పట్ల విషయాల పట్ల పూర్తిస్థాయి అవగాహన ఏర్పడుతుందని భావించవచ్చు.

తెలుగు సాహిత్యం – వ్యాకరణం/అర్థశాస్త్రం/జీవశాస్త్రం

ఇంగ్లీషు సాహిత్యం - వ్యాకరణం/రాజనీతి శాస్త్రం/గణిత శాస్త్రం

హిందీ సాహిత్యం – వ్యాకరణం/చరిత్ర/రసాయన శాస్త్రం

దక్షిణాది భాష – కన్నడ, స్థానిక భాష - ఉర్దూ, ప్రాచీనభాష - సంస్కృతం.

**3.7.** విశ్వవిద్యాలయ విద్య**:-** మారుతున్న కాలంతోపాటు భాషావసరాలు కూడా మారుతూ ఉంటాయి. భాష యొక్క విశ్వరూపాన్ని మనం పట్టుకొని మార్పుకు అనుగుణంగా మలచుకోవాలి. డిగ్రీ స్థాయి విద్యార్థి తన చదువును పూర్తిచేసుకుని సమాజంలో స్వయం వ్యక్తం అవుతున్నప్పుడు అతడు ప్రధానంగా గుర్తింపు పొందేది భాషతోనే. ఉద్యోగ నియామకాల్లో ఇంటర్వ్యూ ప్రముఖ పాత్ర వహించడం ఎందుకు తార్కాణం.

డిగ్రీ విద్యలోకి అడుగుపెట్టి అది పూర్తి చేసుకుని బయటపడిన విద్యార్థి సమాజంలో దేనినైనా ఎదుర్కొనేటట్లు ఉండాలి. సమాజాన్ని, కుటుంబాన్ని పూర్తిస్థాయిలో అర్థం చేసుకోగలిగి ఉండాలి. అందుకే ఉన్నత స్థాయి నియామకాలు అన్నింటికీ, గ్రూప్స్, సివిల్స్, మొదలైనవాటికి డిగ్రీ కనీస విద్యగా ఉంటుంది. అందుచేత, ఈ దశ దాటేసరికి విద్యార్థికి అన్ని విషయాల గురించి ఒక పూర్తి అవగాహన వచ్చి ఉండాలి. అందుకు తగినట్లుగానే మన పాఠ్యప్రణాళిక రూపొందించుకోవాలి.

**3.7.1** పాఠ్యప్రణాళిక:- ఇంటర్మీడియట్ విద్యలో అనుసరించినట్లుగా ఈ దశలోనూ పాఠ్యప్రణాళిక రూపొందించుకుంటే బాగుంటుంది.

**3.7.1.1** ప్రథమ సంవత్సరం**:-** ఈ మూడు భాషల్లో విద్యార్థుల అవసరం, స్థాయిని అనుసరించి పాఠ్యాంశాలను వ్యాకరణాంశాలను రూపొందించుకోవాలి.

తెలుగు - సామాన్య శాస్త్రము

ఇంగ్లీషు - సాంఘిక శాస్త్రము

హిందీ - గణిత శాస్త్రము

**3.7.1.2** ద్వితీయ సంవత్సరం:- పై విధంగానే పాఠ్యప్రణాళిక రూపొందించుకోవాలి. ప్రథమ సంవత్సరం లానే ద్వితీయ సంవత్సరంలోనూ పాఠ్యాంశాలు బోధన జరగాలి.

**3.7.1.3** తృతీయ సంవత్సరం:- కూడా విద్యార్థుల కోరికను దృష్టిలో ఉంచుకొని విదేశీ భాషల రష్యన్ ఫ్రెంచ్ స్పానిష్ అరబిక్ భాషల పరిచయం చేయవచ్చు.

విద్యా విధాన రూప కల్పనతో పాటు మరి కొన్ని ప్రధానమైన అంశాలు ఉన్నాయి.

**4.** కాలపరిమితి: డిగ్రీ విద్య మూడు సంవత్సరాల నుండి నాలుగు సంవత్సరాల వైపుకు ప్రభుత్వం ఆలోచిస్తుంది ఇది మరింత ఆలోచించాల్సిన విషయం. భారతదేశం లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల యువతకు తమ చదువును త్వరగా పూర్తిచేసుకుని సర్టిఫికెట్లను తీసుకోవాలని ఉంటుంది. ఇంటర్మీడియట్ రెండేళ్లు పీజీ రెండేళ్లు మరి డిగ్రీ, నాలుగేళ్లు ఉండటం మన దేశపు యువతకు అంతగా సరిపడకపోవచ్చు.

**5.** వార్షిక విధానం: 2015 నుండి యూజి ని సెమిస్టర్ విధానాల్లో అందిస్తున్నారు. వ్యవసాయక ప్రధాన దేశం కాబట్టి వార్షిక విధానంలోనే మన విద్యార్థులు పూర్తిస్థాయిలో చదువుకోగలుగుతారు. విద్యా విధాన రూప కల్పనతో పాటు మరి కొన్ని ప్రధానమైన అంశాలు ఉన్నాయి.

**6.** బోధన సిబ్బంది: సిలబస్ కు పూర్తి న్యాయం చేకూర్చాలంటే తగినంత బోధని సిబ్బంది ఉండాలి. స్పష్టమైన పని విభజన ఉండాలి. 'కాలము – పని – మనుషులు – వేగము' ఈ నాలుగు అంశాలకు చెందిన లెక్కలు మనం చిన్నప్పుడు చదువుకున్నాం. వాటిని మనం ఇక్కడ అన్వయం చేసుకోవాలి.

**7.** పరీక్షా విధానం: సిలబస్ రూపొందించడం ఎంత ముఖ్యమో ప్రశ్న పత్రం రూపొందించడం కూడా అంతే ముఖ్యం. యుజిసి నిబంధనల ప్రకారం డిగ్రీ విద్యార్థి 20 మార్కులు ఇంటర్నల్స్ ద్వారా, 80 మార్కులు ప్రశ్న పత్రం ద్వారా, పొందవలసి ఉంటుంది. కానీ వంద మార్కులు మూడు గంటల విధానం వల్లే నాణ్యత మెరుగ్గా ఉండవచ్చు. ఈ విధానాన్ని పునః సమీక్షించుకోవాలి.

**8.** ప్రశ్న పత్రం: విద్యార్థుల్లోని సృజనాత్మకతను పరిశోధనాత్మక దృష్టిని పరీక్షించేదిగా ఉండాలి. వ్యాకరణానికి సమ ప్రాధాన్యత ఇవ్వాలి.

**9.** మూల్యాంకన విధానం: భాషాపరమైన దోషాలను తీవ్రంగానే పరిగణిస్తూ శాస్త్రపరమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ మూల్యాంకనం జరగాలి.

**10.** ప్రభుత్వ బాధ్యత

- ❖ అన్ని సౌకర్యాలు ఉన్న విద్యాలయాలు నగరంలోనే కాక అన్ని సదుపాయాలు ఉన్న విద్యాలయాలు గ్రామాలలో కూడా ఉండేలా చూడాలి.
- ❖ మౌలిక సదుపాయాల కొరత ఉన్నప్పటికీ బోధనకు ఆసక్తి చూపే అధ్యాపకులకు తొలి ప్రాధాన్యం ఇచ్చి ఆ విద్యాలయాలను అభివృద్ధి పథంలోకి నడపాలి.

- ❖ మూసి వేసే దిశగా ఉన్న విద్యాలయాలను, సమర్థులైన అధ్యాపకుల చేతికి ఇచ్చి వాటిని నడిపించి ఆ ప్రాంతము నుండి ఆ విద్యాలయం తొలగి పోకుండా చూడాలి.
- ❖ గ్రామీణ ప్రాంతాలలో పనిచేసే అధ్యాపకులకు ప్రత్యేక అలవెన్సులు ఇచ్చినట్లయితే ఆ విద్యాలయాలు మరింత మెరుగు పడవచ్చు.
- ❖ కళలు, క్రీడలు, చేతివృత్తులు మొదలైనవి పాఠశాల స్థాయి నుండే నేర్పించినట్లైతే విద్యార్థులకు మానవీయ విలువలతో కూడిన సంఘజీవితం అలవడుతుంది.

ఫలితాంశాలు

1. పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ వరకు 'వివిధ భాషలు - వివిధ విషయాలు' అనే విధానంలో పాఠ్యపుస్తకాల రూపకల్పన చేస్తే తెలుగు మీడియం ఇంగ్లీష్ మీడియం అనే వ్యత్యాసమే ఉండదు.

2. ఒక వ్యక్తికి అనేక భాషలు వచ్చి ఉండడం అతని ఆత్మవిశ్వాసానికి కారణం అవుతుంది. జీవన నైపుణ్యాలు పెరుగుతూ సాహిత్య సృజన పెరుగుతుంది.

3. సాంస్కృతిక జీవనం పరిఢవిల్లుతుంది.

4. బోధనకు, పరిశోధనకు మాత్రమే అధ్యాపకులు పరిమితమైతే విద్యార్థులకు మరింత మేలు చేకూరు తుంది

5. మెరుగైన ఇంజనీరింగ్ విద్యకు చక్కని ప్రణాళిక, తగిన సంఖ్యలో బోధకులు

6. అవసరానికి తగినట్లుగా మెడికల్ కళాశాలలు, నైపుణ్యం సాధించిన బోధకులు

7. విరివిగా వ్యవసాయ కళాశాలల ఏర్పాటు

8. అర్హత కలిగిన అధ్యాపకుల నియామకం, అర్హత ఆసక్తి కలిగిన డిగ్రీ కళాశాలల అధ్యాపకులను పి.జి.బోధనకొరకు నిబంధనల ప్రకారం స్వీకరించుట

9. పి.జి. స్థాయికి వెళ్ళినప్పుడు విశ్వవిద్యాలయాల్లో ఇంగ్లీష్ మాధ్యమాన్ని సులభంగా అర్థం చేసుకుంటాడు. అనేక పుస్తకాలను చదవగలుగుతాడు.

10. విద్యార్థి అన్ని కోణాల్లో (అభ్యాస, ఉద్యోగ) సర్వసన్నద్ధంగా ఉంటాడు.

11. పట్టణ గ్రామీణ విద్యార్థులు అనే తేడా లేకుండా అందరూ ఒకే విధమైన నైపుణ్యాలు సాధించి రాష్ట్రమంతా (దేశమంతా) ఒకే విద్యా విధానంగా ఉంటే ఉద్యోగులందరూ ఎక్కడైనా పని చేయడానికి సంసిద్ధంగా ఉంటారు.

ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా ఒకటి రెండు ప్రాంతాల్లో ప్రవేశపెట్టి మరింత మెరుగులు దిద్దుకుంటూ వెళ్లిపోతే బంగారు తెలంగాణకు, ఎక్తా భారత్ కు అసలైన బాటలు వేసిన వాళ్ళమవుతాము.

www.ijmer.in

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :6.514(2020); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:9, ISSUE:12(8), December:2020

ఉపయుక్త గ్రంథ సూచి:

1. ఉమామహేశ్వర రావు,గారపాటి. తెలుగు రాష్ట్రాలు భాషాసంక్షోభం. 2017. తెలుగు జాతి పబ్లికేషన్. విజయవాడ.

2.కృష్ణారావు, సత్తిరాజు.తెలుగు భాషా విధానం. 2009. మంచిపుస్తకం.హైదరాబాద్.

3.చంద్రశేఖర్,పి.తెలుగు బోధనలో సమస్యలు - పరిష్కారాలు. 2006. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.హైదరాబాద్.

4.జాతీయవిద్యావిధానం - 2020 - నివేదిక. ఉన్నత విద్యా శాఖ - న్యూఢిల్లీ

5.జిడ్డుకృష్ణమూర్తి రచనలు - తాత్త్వికత - స్వామిబోధానంద. రామకృష్ణమఠం. 2004. హైదరాబాద్

6.బమ్మెర పోతన - ఆంధ్ర మహాభాగవతం-సప్తమ స్కంధం.ప్రహ్లాద చరిత్ర. రామకృష్ణమఠం. 2006. హైదరాబాద్.